

రూ.100 కోట్లతో అభివృద్ధి

కొడంగల్ పట్టణంలోని శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని రూ.100 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. 8లో▸



అర్హులందరికీ సంక్షేమం

పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. 8లో▸



ముర్రుపాలు శ్రేష్ఠం

పుట్టిన బిడ్డకు తొలి ఆహారం, మొదటి టీకా అమ్మపాలే. పిల్లలకు ఇవి ఎంతగానో తోడ్ప డుతాయని వైద్యులు చెబుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ప్రజా సంక్షేమానికి పెద్దపీట



మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

బంట్వారం: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బంట్వారంలో శని వారం లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ పాలనలో ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనను మళ్లీ తీసుకువచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం, ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, నాయకులు మొగులయ్య, పురుషోత్తం రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: నగరంలోని బేగంపేట్‌లో గల హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటవ తరగతి ప్రవేశం కోసం అర్హులైన షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు జిల్లాకు చెందిన వారై ఉండాలని, ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లాకు రెండు సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల వారి వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారి వార్షిక ఆదాయం రూ.2 లక్షలకు మించ రాదన్నారు. విద్యార్థులు 01.6.2018 నుంచి 31.05.2019 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. దరఖాస్తు ఫారాలు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో పొందవచ్చన్నారు. పూర్తి చేయబడిన దరఖాస్తు ఫారాన్ని సంబంధిత ధ్రువపత్రాలతో ఈ నెల 8వ తేదీ లోపు సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 9573859268లో సంప్రదించాలన్నారు.

కాగ్నా బ్రిడ్జి గుంతకు మరమ్మతులు



గుంతపై మరమ్మతులు పూర్తి చేసిన అధికారులు

యాలాల: మండల పరిధిలోని తాండూరు–కొడంగల్ ప్రధాన మార్గంలో ఉన్న కాగ్నా కొత్త బ్రిడ్జిపై గత వారం ఏర్పడిన గుంతకు మరమ్మతులు పూర్తయ్యాయి. గుంత పడిన ప్రదేశంలో మైక్రో కాంక్రీటుతో ఆర్అండ్‌బీ అధికారులు పర్యవేక్షణలో మరమ్మతు పనులను శని వారం సాయంత్రం పూర్తి చేశారు. రెండేళ్ల క్రితమే ప్రారంభించిన కొత్త బ్రిడ్జిపై ఏర్పడిన గుంతతో వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిడ్జిపై ఏర్పడిన గుంత మరమ్మతు విషయమై ప్రత్యేకంగా మైక్రో కాంక్రీటు పద్ధతిని ఉపయోగించి చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఈ పనిని నిర్మాణ సంస్థ రెబ్‌కాన్‌కు అప్పగించి చేపట్టినట్లు ఆర్అండ్‌బీ ఇన్‌చార్జి డీఈ శ్రావణ్ కుమార్ తెలిపారు. పది రోజుల్లో బ్రిడ్జిపై వాహనాల రాకపోకలకు అవకాశం ఉంటుందని వివరించారు.

పుట్టిన బిడ్డకు తల్లిపాలు తాగించాలి

వికారాబాద్ సీడీపీఓ వెంకటేశ్వరమ్మ



ర్యాలీలో అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు

ధారూరు: బిడ్డ పుట్టిన గంట వ్యవధిలో ముర్రుపాలు తాగించాలని వికారాబాద్ సీడీపీఓ వెంకటేశ్వరమ్మ సూచించారు. ధారూరు, కేరెల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లి పాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. తల్లి పాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. వ్యాధులు రాకుండా బిడ్డను జీవిత కాలం కాపాడుతుందన్నారు. తల్లి పాలను బిడ్డకు రెండేళ్ల వరకు కొనసాగించాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీ చేపట్టారు. డబ్బా పాలు వద్దు.. తల్లిపాలు ముద్దు అనే నినాదాలు మార్మోగాయి. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అనురాధ, రమాదేవి, అన్నపూర్ణ, అమృతమ్మ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

దోస్త్ మేరా దోస్త్

సృష్టిలో వెలకట్టలేనిది స్నేహం

- కాపాడుకుంటే కలకాలం పదిలం
- మంచి మిత్రులు దొరకడం గొప్పవరం
- నేడు ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం





స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం అన్నారు ఓ సినీ గేయ రచయిత. స్నేహం వేదాలు తెలపని సత్యం.. శాస్త్రాలు పలకని ఆచారం.. కాలాలు చూడని కావ్యం.. గ్రహాలు సైతం తిరగని గమ్యం.. పండితులు సైతం చదవని శాస్త్రం.. కవులు రాయలేని గ్రంథం.. అదో మధురాతిమధురమైన భావం.. స్నేహం అనిర్వచనీయమైనది.. వెలకట్టలేనిది.. దేనికీ సరితూగని నిధి.. మంచి స్నేహితులు ఉండటం మరింత అదృష్టం.. మన వద్ద ఏమీ లేకపోయినా.. ఎంతమందికైనా పంచగల వస్తువు స్నేహమొక్కటే.. దాన్ని కాపాడుకోవడం ఎంతో అవసరం.. నేడు ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

– వికారాబాద్

స్వార్థం లేనిది స్నేహం



ముందుగా రాష్ట్ర, జిల్లా ప్రజలకు స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు.. దేనిలోనైనా స్వార్థం ఉంటుందేమోకానీ స్నేహం విషయంలో ఉండదు. స్వార్థం ఉంటే స్నేహం అనిపించుకోదు.. నిజమైన స్నేహం ఏమీ ఆశించదు. అలాంటి వారు ఉంటే ఎలాంటి కష్టాలనైనా ధైర్యంగా ఎదుర్కోగలం.. అంతటి గొప్ప మిత్రులు నాకు ఉన్నారు. మా స్వగ్రామం తాండూరు.. చదువుకునే రోజుల్లో స్నేహితులతో కలిసి వాలీబాల్, బ్యాడ్మింటన్ ఆడేవాళ్లం. సుదర్శన్‌గౌడ్, ప్రకాష్‌గౌడ్, రాములు యాదవ్, రమేశ్‌కుమార్, జగన్మోహన్, మధుకర్, వెంకటయ్య నా చిన్ననాటి స్నేహితులు.. బాల్యం మొత్తం వీరితోనే గడిపా. సమయం చిక్కినప్పుడల్లా వీరందరితో మాట్లాడుతుంటా. చిన్నతనంలో చేసిన అల్లరి, సరదాగా గడిపిన రోజులు గుర్తుకు వస్తే మనస్సంతా ప్రశాంతంగా ఉంటుంది. ఆ అనుభూతే వేరు..

– గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన సభ స్పీకర్

స్నేహం గొప్పవరం



ఎవరికైనా స్నేహం అనేది గొప్ప వరం లాంటిది. మంచి స్నేహితులు దొరకడం మరింత అదృష్టమే.. ఈ ప్రపంచంలో ధనిక, పేద అనే తేడా చూడనది స్నేహం ఒక్కటే. దాన్ని దేనితో పోల్చలేము. వెలకట్టలేము.. ఎలాంటి రక్త సంబంధం లేకపోయినా ఫ్రెండ్‌షిప్ కోసం ఏమైనా చేయాలనిపిస్తుంది. స్నేహం చేయడం ముఖ్యం కాదు.. దాన్ని కాపాడుకోవడమే ముఖ్యం.. ఆ ధ్యాస, తపన ఇద్దరిలోనూ ఉండాలి.. అప్పుడే అది కలకాలం పదిలంగా ఉంటుంది. ఏ ఒక్కరు నిర్లక్ష్యం చేసినా అది నిలబడదు.. సమయం దొరికినప్పుడల్లా చిన్ననాటి మిత్రులతో మాట్లాడతా. వారిని మీట్ అవుతా.

– నారాయణరెడ్డి, ఎస్పీ

గుర్తొస్తే ఒళ్లు పులకరించి పోతుంది



కాలంతో పాటు మనం ప్రయాణిస్తున్నప్పుడు మనకు తెలియకుండానే ఎంతో మంది పరిచయం అవుతారు.. అందులో కొందరిని కాలక్రమేణా మరిచిపోతాం.. కొందరు మాత్రం కాలాన్నే మరిపిస్తారు.. వారే మనకు ఇష్టమైన స్నేహితులుగా గుర్తుండిపోతారు.. వెలకట్టలేని అనుభూతిని కలిగిస్తారు.. స్కూల్, కాలేజీ లైఫ్‌లో ఏర్పడిన స్నేహబంధాలు ఎంతో బలపడతాయి.. మా స్వగ్రామం బాన్స్‌వాడ స్కూల్ డేస్‌లో ఇద్దరు మిత్రులు ఉండేవారు.. వారిద్దరూ పదో తరగతిలోనే చదువు మానేశారు. నేను 6 నుంచి ఇంటర్ వరకు నవోదయ స్టూడెంట్‌ని.. పీజీ వరకు హాస్టల్‌లో ఉండి చదువుకున్నా. నా లైఫ్‌లో ఎక్కువ కాలం స్నేహితులతోనే గడిపా. నా ఎదుగుదలకు కూడా వారు ఎంతో దోహదపడ్డారు. ఏటా వారితో మీట్ అవుతా. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటాను.. ఆ సమయంలో ఎంతో ఆనందం కలుగుతుంది. ఏదో తెలియని అనుభూతి చెందుతా. కొన్ని జ్ఞాపకాలు గుర్తొచ్చినప్పుడు నవ్వు ఆపుకోలేను.

– జయసుధ, డీపీఓ

పాతికేళ్ల ప్రయాణం



స్నేహితుడు రవికుమార్‌తో సీఐ శ్రీనివాస్ గౌడ్

శంకర్‌పల్లి: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం ఎస్.ఇటిక్యాలకు చెందిన శ్రీనివాస్ గౌడ్, వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం పులుమామిడికి చెందిన రవి కుమార్ శెట్టి బెస్ట్ ఫ్రెండ్స్. వీరిద్దరిదీ వేర్వేరు జిల్లాలైనా 2001లో సంగారెడ్డిలో డిగ్రీ చేశారు. ప్రస్తుతం శ్రీనివాస్ గౌడ్ శంకర్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నారు. రవికుమార్ మర్పల్లి మండలం కొత్లాపూర్ గ్రామ సెక్రెటరీగా పని చేస్తున్నారు. వీరి పాతికేళ్ల ప్రయాణంలో నిత్యం మాట్లాడుకోని రోజంటూ ఉండదు. మా స్నేహానికి హద్దులు ఉండవని శ్రీనివాస్ గౌడ్ చెప్పారు. కష్ట సుఖాల్లో కలిసే సాగుతామని పేర్కొన్నారు.

చెప్పలేనంత ప్రేమ



చిన్ననాటి స్నేహితుల కుటుంబాలతో కాలకేయ ప్రభాకర్, జడ్జి వినోద్ కుమార్

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్‌కు చెందిన ప్రభాకర్(బాహుబలి చిత్రంలో కాళకేయ పాత్రలో నటించిన వ్యక్తి) సినీ రంగంలో స్థిరపడ్డారు. వినోద్ కుమార్(నాంపల్లి క్రిమినల్ కోర్టు జడ్జి). ఇద్దరికీ చిన్ననాటి స్నేహితులంటే చెప్పలేనంత ప్రేమ. వారితోపాటు పాఠశాలలో చదువుకున్న మిత్రులను ఆప్యాయంగా పలకరిస్తారు. ఉన్నత స్థానంలో ఉన్నా ఎక్కడా వారి గొప్పతనాన్ని ప్రదర్శించరు. ఎప్పటిలాగే బాల్య మిత్రులతో సరదాగా గడుపుతారు. వీరు గ్రామానికి వచ్చిన ప్రతి సారీ స్థానికులు, స్నేహితులతో కలిసిమెలిసి ఉంటారు. ఫ్రెండ్‌షిప్‌కు వీరిచ్చే నిర్వచనమే వేరు..

ఇప్పటికీ టచ్‌లో ఉన్నారు



మాది నల్లగొండ జిల్లా మారుమూల కుగ్రామం.. మా గ్రామంలో 3వ తరగతి వరకే ఉండేది.. పదో తరగతి వరకు పక్క గ్రామంలో చదివా.. నాలుగు కిలోమీటర్లు నడిచి స్కూల్‌కు వెళ్లేవాళ్లం. వర్షం పడితే స్కూల్ మార్గంలోని వాగు పారేది.. దీంతో దుమ్మా కొట్టేవాళ్లం. ఆ సమయంలో స్నేహితులతో కలిసి ఆడుకునే వాళ్లం.. కలిసి చదువుకునే వాళ్లం.. రోజూ ఆడుతూ పాడుతూ స్కూల్‌కి నడుచుకుంటూ వెళ్లే స్నేహితులను ఇప్పటికీ మరచిపోలేను.. చాలా మంది మిత్రులు ఉన్నారు.. ఒకరిద్దరి పేర్లు చెబితే మిగతా వాళ్లను తక్కువ చేసినట్లవుతుంది. ఏది ఏమైనా చిన్ననాడు ఫ్రెండ్స్‌తో గడిపిన జ్ఞాపకాలు ఎప్పటికీ మర్చిపోలేను..

– లింగ్యానాయక్, అడిషనల్ కలెక్టర్

పాతికేళ్ల బంధం మాది



షాబాద్: కష్ట సుఖాల్లో తోడుగా నిలిచే వాడే నిజమైన స్నేహితుడు. అలాంటి మిత్రుడే ఓంకార్. పాతిక సంవత్సరాలుగా ఎంతో అన్యోన్యంగా ఉంటున్నాం. సమయం దొరికినప్పుడల్లా కలుస్తాం. ఇటీవల మరో స్నేహితుడు శ్రీనివాస్‌రెడ్డి రెండు కిడ్నీలు చెడిపోయి మృతి చెందాడు. ఆ కుటుంబానికి స్నేహితలందరూ అండగా నిలిచారు. రూ.7 లక్షలు సేకరించి శ్రీనివాస్‌రెడ్డి పిల్లల పేరిట బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాం. మా వాడి పిల్లలు అనాథలు కారాదనే ఈ నిర్ణయం తీసుకున్నాం. స్నేహానికి కుల, మత తారతమ్యాలు ఉండవు. అమ్మ నాన్న తర్వాత దేవుడిచ్చిన బహుమతే స్నేహితుడు.

– బి.కాంతారెడ్డి, సీఐ, షాబాద్

జంగయ్య యాదికొస్తాడు



జంగయ్య ఇంట్లో జరిగిన కార్యక్రమంలో ఎంపీఓ యాదయ్య

యాలాల: మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం వస్పుల్ గ్రామానికి చెందిన గాలి యాదయ్య, సీహెచ్ జంగయ్య ప్రాణస్నేహితులు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఇద్దరూ కలిసి చదువుకున్నారు. ప్రస్తుతం యాదయ్య యాలాల ఎంపీఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. జంగయ్య నగరానికి వలస వెళ్లి లాండ్రీ షాపు నిర్వస్తున్నారు. యాదయ్య కుటుంబంలో ఏ శుభకార్యం జరిగినా, కుటుంబ నిర్ణయాల్లో జంగయ్య పాత్ర ఉండాల్సిందే. ఉద్యోగ రీత్యా దూరంగా ఉన్నా తరచూ ఫోన్‌లో మాట్లాడుతుంటారు. జంగయ్య కుటుంబంలో ఏ కార్యక్రమం జరిగినా తామంతా వెళ్లాల్సిందేనని యాదయ్య తెలిపారు.

ప్రతిఫలం ఆశించనిదే..



స్నేహబంధం ఎంతో విలువైంది. ఇంట్లో వారితో చెప్పుకోలేని విషయాలు కూడా స్నేహితులతో పంచుకోవచ్చు. స్నేహంతో బంధాలు ఎంతో బలపతాయి. ఫ్రెండ్స్‌తో ఉండే ఆనందం వెలకట్టలేనిది.

– సంగమేశ్వర్‌రెడ్డి, టీచర్, తాళ్లపల్లి పాఠశాల, షాబాద్ మండలం

40 ఏళ్ల బంధం



స్నేహితురాలు లలితతో శ్రీదేవి

తాండూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లాకు చెందిన శ్రీదేవి, లలిత మంచి స్నేహితులు. బాల్యమంతా కడపలోనే చదువుకున్నారు. 6వ తరగతి నుంచే మంచి ఫ్రెండ్స్. వివాహ అనంతరం శ్రీదేవి తెలంగాణాలో.. లలిత కర్ణాటకలో స్థిరపడ్డారు. ప్రస్తుతం శ్రీదేవి తాండూరు మండలం జినుగుర్తి తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. లలిత బెంగళూరులోని నారాయణ స్కూల్‌లో ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. 40 ఏళ్లుగా వీరి స్నేహం కొనసాగుతూనే ఉంది. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా ఉంటారు. ఏదైనా శుభకార్యం జరిగినా, పండుగలు, వేసవి సెలవులు వచ్చినా కలుస్తారు. కుటుంబ సభ్యులతో సరదగా గడుపుతుంటారు. ప్రపంచంలో వెల కట్టలేనిది స్నేహం మాత్రమే అని శ్రీదేవి తెలిపారు.

మేమున్నామని..



ఇబ్రహీంపట్నంలో 1983-84 వరకు కలిసి పదో తరగతి చదువుకున్న విద్యార్థుల వదలని స్నేహం

ఇబ్రహీంపట్నం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1983– 84 పదో తరగతి పూర్వ విద్యార్థులు 50 ఏళ్లుగా చెక్కు చెదరని స్నేహాన్ని కొనసాగిస్తున్నారు. ఆపదలో ఉన్న స్నేహితులను ఆదుకుంటూ మేమున్నామంటూ అండగా నిలుస్తున్నారు. తాము చదువుకున్న పాఠశాలకు ఇటీవల రూ.1.50 లక్షల విలువైన బెంచీలు, బీరువా తదితర సామగ్రిని అందజేశారు. మహిళా దినోత్సవం, ఫ్రెండ్‌షిప్ రోజున ఒక్కచోటకు చేరి పాత జ్ఞాపకాలను నెరమువేసుకుంటున్నారు. వృద్ధాప్యం ముంచుకువస్తున్నా తరచూ కలుస్తూ స్నేహానికి కన్న మిన్న లోకాన లేదురా అని చాటిచెబుతున్నారు.

బాల్య మిత్రులు.. 'బాధ్యత'గా..



కొడంగల్‌లో విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న మిత్ర బృందం

కొడంగల్: కొడంగల్ ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1990 బ్యాచ్‌కు చెందిన కొందరు విద్యార్థులు 16 ఏళ్ల క్రితం బాధ్యత అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. వారు సంపాదించిన డబ్బులో కొంత సమాజసేవకు వినియోగిస్తున్నారు. సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు ఏటా ఉచితంగా నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేస్తున్నారు. కటుకం వెంకటేశ్, మురహరి వశిష్ఠ, శివకుమార్ గుప్తా, లక్ష్మీనారాయణ జోషి, కిట్టుస్వామి, కృష్ణారావు, కొంతం సతీష్, నగేశ్, ఆనంద్ కుమార్ లాహోటీ, కానుకుర్తి రమేష్, వేణు, బాలరంగాచారి మంచి స్నేహితులు. ఫ్రెండ్‌షిప్‌కు ఆదర్శంగా నిలుస్తున్నారు. గతంలో పాలమూరు జిల్లాను వరదలు ముంచెత్తి నప్పుడు ప్రజల సహకారంతో రూ.2.5 లక్షల విలువ చేసే సరుకులు, మందులు, దుస్తులను మాగనూరు మండలంలోని కృష్ణా నది పరీవాహక ప్రాంతంలో పంపిణీ చేశారు.

ఒకే గిన్నెలో తిన్నాం



నేను నా స్నేహితురాలు స్వాతి ఇద్దరం కే దగ్గర చదువుకున్నాం. నేను ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్నాను. స్వాతి వరంగల్‌లో టీచర్‌గా పని చేస్తోంది. మా స్నేహం విడదీయరానిది. మేము చదువుకునే రోజుల్లో ఇద్దరం ఒకే గదిలో ఉండి వాళ్లం. ఒకే గిన్నెలో తిన్నాం. ఇప్పటికీ అదే ఆప్యాయతతో కలిసి ఉన్నాం.

– అపర్ణ, ఎంపీడీఓ, షాబాద్

సమాజహితం కోరి..



పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన యువతను సత్కరిస్తున్న స్నేహహస్తం ఫౌండేషన్ సభ్యులు

ఆమనగల్లు: ఆమనగల్లు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 1994 – 95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులందరూ 'స్నేహ హస్తం' పేరిట సమాజ సేవ చేస్తున్నారు. ప్రస్తుతం చాలా మంది ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడ్డారు. సమాజానికి ఏదైనా చేయాలనే సంకల్పంతో స్నేహ హస్తం ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్ సీఐగా పనిచేస్తున్న గజ్జె చరమందరాజు, ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ ఫౌండేషన్ కొనసాగుతోంది. అనారోగ్యానికి గురైన బాల్య మిత్రులకు అండగా నిలుస్తున్నారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నారు.

వారు దేవుడిచ్చిన వరం



విహార యాత్రలో స్నేహితులతో కృష్ణయ్య

చేవెళ్ల: స్నేహం అనేది నాకు దేవుడిచ్చిన వరం. తల్లిదండ్రుల తర్వాత స్నేహితులే ముఖ్యం అని చేవెళ్ల తహసీల్దార్ బి.కృష్ణయ్య అన్నారు. చిన్ననాటి స్నేహితులు పి.శ్రీనివాస్, ఐ.కృష్ణయ్య, కె.నర్సింలు జ్ఞాపకాలను 'సాక్షి'తో పంచుకున్నారు. పరిగి మండలం రూప్‌ఖాన్‌పేటకు చెందిన మేమందరం పాఠశాల స్థాయి నుంచే స్నేహితులం. అంతేకాకుండా ఫ్యామిలీ ఫ్రెండ్స్‌గా కొనసాగుతున్నాం. ముగ్గురూ నాకంటే ఒక్క క్లాస్ సీనియర్లు.. మా మైత్రి పదో తరగతి వరకు సాగింది. ఇంటర్, డిగ్రీ వేర్వేరు కళాశాలల్లో చదువుకున్నా రోజూ కలిసేవాళ్లం. వృత్తి రీత్యా వివిధ రంగాల్లో రాణిస్తున్నాం. నేను తహసీల్దార్‌గా, నర్సింలు హెడ్‌కానిస్టేబుల్‌గా. కృష్ణయ్య వ్యవసాయం, శ్రీనివాస్ వ్యాపారం చూస్తూ స్థిరపడ్డాం. ఆదివారం, సెలవు రోజుల్లో కలుసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఎవరి కుటుంబంలో సమస్య వచ్చినా కలిసి పరిష్కరించుకుంటాం. మిత్రులందరికీ స్నేహితుల రోజు శుభాకాంక్షలు.

– బి.కృష్ణయ్య, తహసీల్దార్, చేవెళ్ల

క్లుప్తంగా

కొనసాగుతున్న జోనల్ స్థాయి ఎంపిక

ఎస్‌జీఎఫ్ క్రికెట్‌కు 18 మంది



ఎంపికైన క్రీడాకారులతో పీఈటీలు

బషీరాబాద్: తాండూరు జోనల్ క్రీడాకారుల ఎంపిక బషీరాబాద్ బాలుర పాఠశాల మైదానంలో కొనసాగుతున్నాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వివిధ క్రీడల్లో ఎంపిక చేస్తున్నారు. శనివారం అండర్ 14లో 200 మంది హాజరుకాగా, వీరిలో 18 మందిని జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక చేసినట్లు పీడీ అంబదాస్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు నెల రోజుల శిక్షణానంతరం జిల్లా స్థాయికి పంపుతామన్నారు. అయితే ప్రభుత్వం క్రీడాకారులకు మొదటి రోజు భోజన సౌకర్యం కల్పించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శనివారం బషీరాబాద్‌కు చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ జయ్‌రామ్ చారి 200మంది విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు అనంతయ్య, శివ, రాజు, రవీందర్ రెడ్డి, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బాత్‌రూంలో జారిపడి వలస కూలీ మృతి

మొయినాబాద్: బతుకు దెరువు కోసం వలస వచ్చిన ఓ కూలీ బాత్‌రూంలో జారిపడి మృతి చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన బంటి(27) అదే ప్రాంతానికి చెందిన పుష్పేందర్, గుజార్‌తో కలిసి మూడు నెలల క్రితం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌కు వలస వచ్చారు. గ్రామ సమీపంలోని పైప్‌లైన్ రోడ్డులో ఉన్న అవసా విల్లాలో టైల్స్, మార్బుల్స్ పనిచేస్తూ అక్కడే ఓ గదిలో ఉంటున్నారు. కాగా శుక్రవారం రాత్రి 8 గంటలకు భోజనం చేసి నిద్రపోయారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో బంటి బాత్‌రూంకు వెళ్లి అందులో జారి పడ్డాడు. అతని తలకు గాయమైంది. అతనితో ఉన్నవారు నీళ్లు తాగించి పడుకోబెట్టారు. ఉదయం 6 గంటలకు బంటిని నిద్రలేపినా లేవలేదు. వెంటనే స్థానిక భాస్కర ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ల పట్టివేత

కద్తాల్: పరిమితికి మించి ఓవర్‌లోడ్‌తో రవాణా చేస్తున్న రెండు టిప్పర్లను ఆర్టీఏ అధికారులు పట్టుకున్న సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఆర్టీఏ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే మున్ని ఆధ్వర్యంలో మండల కేంద్రంలో వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌తో పాటు, ఓవర్‌లోడ్‌తో కంకరపొడిని తరలిస్తున్న మరో వాహనాన్ని సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రోడ్డు నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని వెహికిల్ ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్టీఏ కానిస్టేబుల్ జగన్, సిబ్బంది ఉన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

కేశంపేట: చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సంతాపూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యాలాల రాకేష్(40) మేస్త్రీ పనులు చేస్తూ తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నాడు. ఆయన గ్రామానికి చెందిన లేగలకాడి శ్రీనుతో కలిసి శివారులోని నాగుల చెరువులో చేపల వేటకు వెళ్లారు. రాకేష్ మద్యం మత్తులో ఉండటంతో చెరువులో పడిపోయాడు. ఆయన్ని రక్షించేందుకు గ్రామస్తులు ప్రయత్నించినా విఫలమయ్యాయి. అనంతరం మృతదేహాన్ని వెలికి తీసి పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి రాంచంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నరహరి తెలిపారు.

రూ.వంద కోట్లతో శ్రీవారి ఆలయ అభివృద్ధి

వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా పునఃనిర్మాణ పనులు

- రెండేళ్లలోపు పూర్తి చేస్తాం
- ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్



మ్యాప్‌ను పరిశీలిస్తున్న శైలజా రామయ్యార్

కొడంగల్: పట్టణంలోని శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని రూ.100 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్ అన్నారు. వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా రెండేళ్లలోపు పునఃనిర్మాణ పనులు పూర్తి చేస్తామని స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, వాస్తు నిపుణులతో కలిసి శనివారం ఆమె కొడంగల్‌కు వచ్చారు. ముందుగా కడా కార్యాలయంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఎండోమెంట్ కమిషనర్ వెంకట్‌రావ్, ధార్మిక సలహాదారు గోవింద హరి, వాస్తు నిపుణుడు సపతితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలను పరిశీలించారు. దేవాలయ పునరుద్ధణకు సంబంధించిన వివరాలను వాస్తు శిల్పి సత్యనారాయణ మూర్తి పవర్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు. డిజిటల్ స్క్రీన్‌పై అధికారులు వీక్షించారు. అనంతరం శైలజారామయ్యార్ శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆమెకు స్వాగతం పలికారు. ఆలయ ధర్మకర్తలు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అనంతరం ఆమె ఆలయ పరిసరాలను పరిశీలించారు. గోశాలను, మండపం, పుష్కరిణి, వరాహస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న వారికోసం ప్రత్యేకంగా రూపొందించిన వెంచర్‌ను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. శ్రీవారి ఆలయ అభివృద్ధి అనంతరం ఈ ఆప్రాంతం పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఇందుకోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నామన్నారు. తిరుమల తరహాలో వైఖానస ఆగమ శాస్త్రోకంగా కొడంగల్‌లోని ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. క్యూలైన్, కల్యాణ మండపం, కల్యాణ కట్ట, పూజా మందిరాలు, వసతి గదులు, స్నాన ఘట్టాలు, మరుగుదొడ్లు, పార్కింగ్, పుష్కరిణి, ప్రసాదం కౌంటర్లు తదితర వాటికి నూతన భవనాలు నిర్మించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష చౌదరి, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, ఎంపీడీఓ ఉషశ్రీ, ఆలయ ఈఓ రాజేందర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు నందారం శ్రీనివాస్, రత్నం, మధు, కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్ పాల్గొన్నారు.

దౌల్తాబాద్ ఆలయ సందర్శన

దౌల్తాబాద్: దౌల్తాబాద్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తామని దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యార్ అన్నారు. శనివారం ఆమె ఆలయాన్ని సందర్శించి, వివరాలు తెలుసుకున్నారు.

స్థానిక ఎన్నికల్లో ఓడిపోతామనే..



పరిగిలో మాట్లాడుతున్న డాక్టర్ మెతుకు ఆనంద్

- కాంగ్రెస్ పాదయాత్రపై బీఆర్‌ఎస్ నేతల విమర్శలు
- అది జన రహిత పాదయాత్ర: మాజీ ఎమ్మెల్యే ఆనంద్
- సీఎం రేవంత్‌రెడ్డికే ఇష్టం లేదు: మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే కాంగ్రెస్ పార్టీ జనహిత పాదయాత్ర నిర్వహిస్తోందని, కానీ అది జనరహిత పాదయాత్రగా మారిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో 420 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలకు ఏం చేసిందో చెప్పాలన్నారు. జనాల్లోకి వెళ్లకుండా బందోబస్తు నడుమ పాదయాత్ర చేస్తే ఏం తెలుస్తుందని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీల్లో దేన్నీ పూర్తిగా అమలు చేయడం లేదని ధ్వజమెత్తారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం రాష్ట్రానికి ద్రోహం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై జనాలను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. యాభై ఏళ్ల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏం చేసిందో చూపించాలని డిమాండ్ చేశారు.

ప్రజలు కేసీఆర్ పాలన కోరుకుంటున్నారు..

పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ చేపట్టిన పాదయాత్ర అట్టర్ ప్లాఫ్ అయ్యిందన్నారు. ఇందులో ఎక్కడా వెయ్యి మంది కూడా కనిపించలేదని, ప్రభుత్వంపై వ్యతిరేకతకు ఇదే నిదర్శనమని తెలిపారు. కాంగ్రెస్ చేస్తున్న పాదయాత్ర సీఎం రేవంత్‌రెడ్డికే ఇష్టం లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పనైపోయిందని, ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అధిక సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, మున్సిపల్ మాజీ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సురేందర్, తాహెర్‌అలీ, రవికుమార్, కృష్ణ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- చెరువులను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతా
- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



మంజూరు పత్రం అందజేస్తున్న స్పీకర్

మర్పల్లి: పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. కల్కోడ, ఘనాపూర్‌లో పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. మండలంలోని అన్ని చెరువుల వివరాలు సేకరించి మరమ్మతులు చేపట్టి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతానన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, దరఖాస్తులు చేసుకుంటే చెత్తబుట్టలో పడేశారన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. రైతాంగం కోసం గత యేడాదిన్నరలో లక్షా 5 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసిందని తెలిపారు. అనంతరం ఎనిమిది సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గూడెం రాములు యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సురేష్, వైస్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్, సహకార సంఘం వైస్ చైర్మన్ ఫసియొద్దీన్, బ్లాక్ టూ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గణేష్, నాయకులు జగదీశ్వర్, రఘుపతి రెడ్డి, రామేశ్వర్, రాచన్న, శేఖర్‌యాదవ్, నర్సింలుయాదవ్, సర్వేష్, రఫీ, వెంకట్ రెడ్డి, అశోక్ రెడ్డి, తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీఓ సిటి జయరాం, స్పెషల్ ఆఫీసర్ మోహన్ కృష్ణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

డీసీఎం ఢీకొట్టడంతో భార్యాభర్తలు మృతి



లక్ష్మి (ఫైల్)

పరిగి: సంతలో కూరగాయలు విక్రయించి ఇంటికి వెళ్తున్న దంపతులకు డీసీఎం మృత్యుపాశంగా మారింది. బైక్‌ను ఢీకొట్టడంతో భార్యాభర్తలు మృతి చెందిన సంఘటన శనివారం పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొంరాస్‌పేట మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొనింటి లక్ష్మమ్మ(33), వెంకటయ్య(42) భార్యాభర్తలు. ఇద్దరూ నిత్యం సంతలో కూరగాయలు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. శనివారం పరిగి సంత కావడంతో కూరగాయలు అమ్ముకునేందుకు వచ్చి సాయంత్రం ఇంటికి బైక్‌పై బయలు దేరారు. మార్గమధ్యలో సుల్తాన్‌పూర్ గేట్ దగ్గర వెనుక నుంచి వచ్చిన డీసీఎం వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా వెంకటయ్య అపస్మర కస్థితిలోకి వెళ్లాడు. ఆయన్ని చికిత్స నిమిత్తం వికారాబాద్‌కు తరలించగా అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

యాచారం: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మంచాల మండలం కాగజ్‌ఘాట్ గ్రామానికి చెందిన శివ యాచారం పీఎస్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. జూలై 29న ఆయన భార్య సుజాత(42) శివను కలవడానికి యాచారానికి వచ్చింది. ఇద్దరు కలిసి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో యాచారం ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో సుజాత బైక్‌పై నుంచి జారి పడి పోయింది. తీవ్ర గాయాలైన ఆమెను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి ఆమె మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని

కూలీ దుర్మరణం

మహేశ్వరం: బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని మహేశ్వరం గేటు సిరిగిరిపురం అర్బన్ ఫారెస్టు వద్ద చోటు చేసుకుంది. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిగిరిపురం గ్రామానికి చెందిన తడకల బాలకృష్ణ(40) కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆయన శనివారం సాయంత్రం మహేశ్వరం గేటు నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా అర్బన్ ఫారెస్టు వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమవ్వడంతో బాలకృష్ణ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

బంగారం అపహరణలో కేసు నమోదు

నందిగామ: మండల పరిధిలోని మామిడిపల్లిలో జరిగిన భారీ దొంగతనం కేసులో పోలీసులు ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన చాకలి కృష్ణయ్య ఇంట్లో రూ.15 లక్షల నగదు, 16 తులాల బంగారాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన విషయం విధితమే. బాధితుడు కృష్ణయ్య గత నెల 27న ఇంట్లో దాచిన బంగారం, నగదు కనబడక పోవడంతో పోలీసులను ఆశ్రయించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి ఎట్టకేలకు కేసు నమోదు చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తున్నామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెద్దేముల్, యాలాల, బషీరాబాద్, తాండూరు మండలాలతో పాటు మున్సిపల్ పరిధిలో అనారోగ్యంతో కార్పొరేట్ ఆస్పత్రులలో వైద్య సేవలు పొందిన వారికి సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. 170 మంది లబ్ధి దారులకు రూ.56.60 లక్షలకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాండూరు నియోజకవర్గం ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. పేదల ఆరోగ్యం కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10 లక్షల వరకు ఆర్థికభరోసా కల్పిస్తోందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

పూడూరు: ఆటో, కారు ఢీకొన్న ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలైన సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది . ఎస్‌ఐ భరత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కుల్కచర్ల మండలం పుట్టపహాడ్ గ్రామానికి చెందిన నలుగురు ఆటోలో మన్నెగూడ మీదుగా హైదరాబాద్ వెళ్తున్నారు. మార్గమధ్యలో కండ్లపల్లి గేటు సమీపంలో ఓ కారు వీరిని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మహేష్‌కు తీవ్రగాయాలు కాగా మిగతావారికి స్వల్పగాయాలయ్యాయి. కేసు నమోదు చేసు కుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిరుపేద కుటుంబానికి అండ

జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్



నారాయణ కుటుంబాన్ని పలకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

పరిగి: నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ప్రకటించారు. పట్టణ కేంద్రానికి చెందిన నారాయణ, అతని కుమారుడు, కోడలు, మనవడు ఇల్లు లేక శ్మశానవాటికలో ఆరు నెలలుగా ఉంటుండంతో ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ శనివారం వారిని కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలుడి వైద్య ఖర్చులకు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. నారాయణ కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. తల్లిదండ్రులను కోల్పోయిన నారాయణ మనువడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు. పట్టణ కేంద్రంలో స్థలాన్ని సేకరించి కాంట్రాక్టర్ ద్వారా ఇల్లు నిర్మించే విధంగా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న రెవెన్యూ కార్యాలయాన్ని పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలతో పనులను నిర్వహించాలని ఎలాంటి అవకతవకలు జరిగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీఓ వాసుచంద్ర, డీఎంహెచ్‌ఓ లలితాదేవి, డీడబ్ల్యూఓ కృష్ణవేణి, తహసీల్దార్ వెంకటేశ్వరి, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సీజనల్‌పై అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్ర వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ నరేందర్ కుమార్



వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య విద్యా సంచాలకులు నరేందర్ కుమార్

అనంతగిరి: ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నమోదయ్యే అవకాశం ఉన్నందున వైద్యులందరూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ నరేందర్ కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలోని పలు విభాగాలను పరిశీలించి అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వైద్యులకు ఆస్పత్రిలో సేవల విస్తరణ కోసం తగు సూచనలు చేశారు. అనంతరం పట్టణంలోని పాత ఆస్పత్రిలో నిర్వహిస్తున్న మాతా శిశు సంరక్షణ సేవలను ఆయన పరిశీలించారు. ఆస్పత్రిలో వివిధ విభాగాల్లో జరుగుతున్న మరమ్మతులు, మార్పులపై ఆరా తీశారు. అక్కడి నుంచి రామయ్యగూడ పీహెచ్‌సీ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ అందజేస్తున్న సేవలకు సంబంధించి వివరాలు తెలుసుకోవడంతో పాటు పలు రికార్డులను ఆయన పరిశీలించారు. వైద్యులంతా అప్రమత్తంగా ఉండి ప్రజలకు సేవలు అందించాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందితో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్, డాక్టర్ రాంచంద్రయ్య, ఆయా విభాగాల వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాటారు.. నరికారు..

తాండూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట చెట్ల నరికివేత



మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో నరికేసిన చెట్ల కొమ్మలు, దుంగలు

తాండూరు: మొక్కలు నాటి చెట్లను పెంచాలని ఓ వైపు ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేస్తుంది. వనమహోత్సవం పేరిట తాండూరు మున్సిపాలిటీకి లక్ష్యం నిర్దేశించారు. కాని లక్ష్యం పక్కన పెట్టి అధికారులు మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలోని చెట్లను నరకడం వివాదాస్పదంగా మారింది. మున్సిపల్ కార్యాలయ భవనం వెనకల నాలుగేళ్ల క్రితం నాటిన మొక్కలు చెట్లుగా మారాయి. కార్యాలయ ప్రాంగణంలో మాత్రం కారణం లేకుండానే నరకడం విమర్శలకు తావిస్తోంది.

దీపం కింద పడి ఇల్లు దగ్ధం

రూ.2.50 లక్షలు, 4 తులాల బంగారం బూడిద



కాలిన ఇల్లును పరిశీలిస్తున్న అధికారులు

దౌల్తాబాద్: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో శనివారం ప్రమాదవశాత్తు ఓ ఇల్లు దగ్ధమై రూ.2.50 లక్షల నగదు, 4 తులాల బంగారం కాలి బూడిదైన సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఎర్రవిల్ల అనంతప్ప కుటుంబసభ్యులు శ్రావణమాస శనివారం కావడంతో ఇంట్లో దేవుడికి పూజ చేసి దీపం ముట్టించి పొలానికి వెళ్లారు. మధ్యాహ్నం ఇంట్లో నుంచి పొగలు రావడం చూసి చుట్టు పక్కల వారు పైనబండలు తీసి మంటలు ఆర్పారు. ఇప్పటికే రూ.2.50 లక్షలు, 4 తులాల బంగారం మంటలకు కాలిపోయాయి. దీంతో కష్టపడి కూలి పనులు చేసి సంపాదించిన డబ్బులు, బంగారం కాలిపోవడంతో బాధితులు బోరున విలపిస్తున్నారు. దేవుడి దీపం కిందపడడంతో ఇల్లు అంటుకుందని ప్రాథమికంగా భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ రాజుకుమార్, ఆర్‌ఐ సునీల్ పరిశీలించారు.

'మధ్యాహ్న భోజనం' బంద్

- తింసాన్‌పల్లి పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ
- ఏజెన్సీ నిర్వాహకులు, ఎంఈఓపై అసహనం
- వెంటనే అమలు చేయాలని ఆదేశం



తింసన్‌పల్లి పాఠశాలను సందర్శించిన డీఈఓ రేణుకాదేవి

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం తింసాన్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం అమలు నిలిచిపోయింది. దీంతో స్కూళ్ల ప్రారంభమైన నాటి నుంచి సుమారు యాభై రోజులుగా విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న డీఈఓ రేణుకాదేవి శనివారం పాఠశాలను తనిఖీ చేశారు. కేవలం 13 మంది విద్యార్థులు మాత్రమే ఉండటం, బిల్లులు సరిగా రాకపోవడం, వంటి కారణాలతో ఏజెన్సీ నిర్వాహకులు భోజనం వండటం లేదు. గతంలోనే ఈ విషయాన్ని ఉపాధ్యాయులు ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఫలితం లేకపోవడంతో డీఈఓ వారిని పిలిపించి భోజనం అందించా లని సూచించారు. బిల్లులు అందేలా తాను చూ స్తానని హామీ ఇచ్చారు. మరోసారి భోజనం పెట్టలే దని తెలిస్తే చర్యలు తప్పవని ఎంఈఓ నర్సింగ్‌రా వుతో పాటు ఉపాధ్యాయులను హెచ్చరించారు.

గంజాయి విక్రేతల అరెస్టు



గంజాయి తరలిస్తున్న వారిని పట్టుకున్న డీటీఎఫ్ అధికారులు

పరిగి: గంజాయి తరలిస్తుండగా ఇద్దరు వ్యక్తులను పట్టుకున్న సంఘటన శనివారం మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గేట్ సమీపంలో చోటు చేసుకుంది. జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలో గంజాయి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారంతో లక్ష్మీదేవిపల్లి గేట్ సమీపంలో సోదాలు నిర్వహించారు. బైక్‌పై ఇద్దరిని తనిఖీ చేసి 260 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని పరిగి పట్టణ కేంద్రానికి చెందిన నీరజ్‌కుమార్, షాద్‌నగర్ మండలం ఎలికట్టే గ్రామానికి చెందిన విపిన్ కాంకర్‌లుగా గుర్తించారు. వారి వద్ద ఉన్న బైక్‌ను సీజ్ చేసి ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎక్కడైనా గంజాయి విక్రయించినా, తరలించినా వెంటనే సమాచారం అందించాలని సూచించారు. మాదక ద్రవ్యాల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందన్నారు. మత్తు పదార్థాలు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆబ్కారీ అధికారులు పాల్గొన్నారు.